క్లుప్తంగా

టీస్టాల్‌లో ప్లాస్టిక్ గ్లాసులు వాడొద్దు



మరికల్: టీస్టాల్‌లో వాడుతున్న ప్లాస్టిక్ గ్లాసులను తొలగించాలని అఖిలపక్షం నాయకులు శుక్రవారం టీస్టాల్ వ్యాపారులకు సూచించారు. మండల కేంద్రంలో ప్లాస్టిక్ గ్లాసుల్లో టీలు ఇస్తున్న వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్లాస్టిక్ గ్లాసుల కారణంగా క్యాన్సర్ సోకే ప్రమాదం ఉందని వాటిని నిషేధించాలని యజమానులకు కోరారు. కార్యక్రమంలో శేఖర్, కొండప్ప, నారాయణ, కృష్ణయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

రెవెన్యూ స్థలంలో డబ్బాలు తొలగించాలి

మరికల్: మండల కేంద్రంలోని రెవెన్యూ స్థలంలో వేసిన డబ్బాలను తొలగించాలని శుక్రవారం గ్రామస్తులు తహసీల్దార్ రాంకోటి దృష్టికి తీసుకెళ్లారు. పాత బస్టాండ్ వద్ద శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ కార్యాలయ ఆవరణలో ఖాళీ స్థలంలో ప్రజాప్రతినిధుల అండతో డబ్బాలు వేసి స్థలాలను అక్రమించుకుంటున్నారని వారు తహసీల్దార్‌కు వివరించారు. ఇందుకు స్పందించిన ఆయన రెవెన్యూ స్థలం ఆక్రమణకు గురి కాకుండా అక్కడ వేసిన డబ్బాలను తొలగించి స్థలం చుట్టూ కంచె ఏర్పాటు చేయిస్తామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో హరీష్, రాజేష్, వేణు, శేఖర్, కృష్ణయ్య పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల కొరత తీర్చండి

మరికల్: స్థానిక బాలుర ఉన్నత పాఠశాల్లో ఉపాధ్యాయుల కొరత వేధిస్తుందని విద్యార్థులకు తగ్గ ఉపాధ్యాయులను నియమించాలని యువక మండలి సభ్యులు కోరారు. శుక్రవారం వారు మాట్లాడుతూ.. పాఠశాల్లో 673 మంది విద్యార్థులు ఉన్నారని, ఇందుకు గాను 25 మంది ఉపాధ్యాయులు ఉండాలన్నారు. కాని ఇక్కడ హెచ్‌ఎంతో కలిపి 20 మంది మాత్రమే ఉన్నారని తెలిపారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా డిప్యూటేషన్ మీద మరికల్ బాలుర ఉన్నత పాఠశాలకు ఉపాధ్యాయులను పంపించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

రెగ్యులర్ ఎంఈఓను కేటాయించాలి

ధన్వాడ: మండలానికి రెగ్యులర్ ఎంఈఓ లేకపోవడం వల్ల విద్యా వ్యవస్థ కుంటుపడుతుందని సీపీఐ నాయకులు ఆరోపించారు. శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండలానికి ప్రస్తుతం ఇన్‌చార్జ్ ఎంఈఓ వారం అయిన కార్యాలయనికి రావడంలేదని, దీంతో ఉపాధ్యాయులు పాఠశాలకు ఇష్టం వచ్చినప్పుడు వస్తూ వెళ్తున్నారని ఆరోపించారు. తండాలలో ఉన్న పాఠశాలకు ఉపాధ్యాయులు సరైన సమయానికి రావడం లేదన్నారు. వెంటనే రెగ్యులర్ ఎంఈఓను నియమించాలని డిమాండ్ చేశారు.

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

మద్దూరు: కొత్తపల్లి మండలంలోని లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబాకర్ చెక్కులను ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి కొత్తపల్లిలో శనివారం మధ్యాహ్నం పంపిణీ చేయడం జరుగుతుందని కొత్తపల్లి తహసీల్దార్ లతారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని 103 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తామని తెలిపారు. అలాగే మన్నాపూర్‌లో 33/11 కేవీ షిఫ్టింగ్ లైన్, ఎల్‌ఈడీ లైట్లను ప్రారంభించనున్నట్లు మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య

నారాయణపేట రూరల్: ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందుతుందని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి యాదీర్ జనార్దన్‌రెడ్డి అన్నారు. మండలంలోని లక్ష్మీపూర్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం టై, బెల్టులు, నోటుపుస్తకాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన భోజనం, శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో బోధన, ఉచితంగా యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాలు అందిస్తుందన్నారు. ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సర్పంచ్ రామ్మోహన్, ఎంపీటీసీ బాలమణి, పంచాయతీ కార్యదర్శి నవిత, టీచర్లు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

నారాయణపేట టౌన్: హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు ఆగస్టు 4న వద్ద నిర్వహించే ఐఎఫ్‌టీయూ పోరు గర్జనకు విజయవంతం చేయాలని రాష్ట్ర ఉపాధ్యక్షుడు హన్మేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని భగత్‌సింగ్ భవన్‌లో జిల్లా కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ వర్కర్స్‌ను పర్మనెంట్ చేయాలని, కనీస వేతనం రూ. 26 వేలు అందించాలన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో కిరణ్, నర్సింహులు, నర్సింహ, రామాంజనేయులు, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

మక్తల్: అంతర్జాతీయ ఖోఖో దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం పట్టణంలోని స్టేడియం నుంచి విద్యార్థుల జెండా ఊపి ర్యాలీ నిర్వహించారు. మక్తల్‌లో పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్యమే మహాభాగ్యం, వందేమాతరం అంటూ నినాదాలు చేశారు.

కర్నిలో క్రీడలు ప్రారంభం

జాతీయ ఖోఖో క్రీడల దినోత్సవం సందర్భంగా మండలంలోని కర్ని జెడ్పీహెచ్ఎస్‌లో బాలికలకు జిల్లా స్థాయి ఖోఖో పోటీలను రాష్ట్ర పీసీసీ కార్యవర్గ సభ్యుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసాన్నిస్తాయన్నారు. శారీరక దృఢత్వం, సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని తెలపారు. కార్యక్రమంలో రిటైర్డ్ పీఈటీ గోపాలం, హెచ్‌ఎం రఘువీర్, పీఈటీ రూప, సర్పంచ్ అక్రమ్, ఎంపీటీసీ రంగప్ప, విద్యాకమిటీ చైర్మన్ రంగప్ప, ఎల్లప్ప, మంజుల, విష్ణువర్ధన్, ఈశ్వర్, రాజు, చక్ర, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మాగనూర్: అంతర్జాతీయ ఖోఖో దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని నేరడగం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఖోఖో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాంప్లెక్స్ హెచ్‌ఎం వెంకటయ్య మాట్లాడుతూ.. ఖోఖో అనేది మన దేశంలో పుట్టిన గొప్ప క్రీడ అని అన్నారు. విద్యార్థులు క్రీడలు ఆడటం వల్ల శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం కూడా సాధిస్తారని తెలిపారు. చదువులతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో పీఈటీ శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.



కర్నిలో పోటీలను ప్రారంభిస్తున్న ప్రశాంత్‌కుమార్‌రెడ్డి



నేరడగంలో..



మక్తల్‌లో..

రాష్ట్రవ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి

కోస్గి: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్‌తో కార్మిక జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 6 నుంచి చేపట్టనున్న రాష్ట్రవ్యాప్త పంచాయతీ కార్మికుల సమ్మెను విజయవంతం చేయాలని పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నర్సిములు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం గుండుమాల్ మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో కార్మికులతో సమావేశం ఏర్పాటు చేశారు. సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేసిన ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. పంచాయతీ కార్మికులకు జీఓ 60 ప్రకారం వేతనాలు పెంచి, కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని కోరారు. ప్రభుత్వం జీఓ 51 అమలు చేస్తూ మల్టీ పర్పస్ వర్కర్ విధానాన్ని అమలు చేస్తుందని, జనాభాను బట్టి కార్మికుల సంఖ్యను పెంచాలన్నారు. పంచాయతీలకు ట్రాక్టర్లు కేటాయించి నూతనంగా డ్రైవర్లను నియమించకుండా కార్మికులతోనే వాహనాలు నడిపించడంతో ప్రమాదాలు జరిగి ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మరణించిన కార్మిక కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం అందించాలని కోరారు. న్యాయబద్ధమైన డిమాండ్ల సాధన కోసం చేపడుతున్న రాష్ట్రవ్యాప్త సమ్మెలో పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొని ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు రాములు, మండల అధ్యక్షుడు వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు నర్సిములు

ప్రాథమిక హక్కులపై అవగాహన



మందిపల్లిలో చట్టాలపై అవగహన కల్పిస్తున్న పోలీసు అధికారులు

మాగనూర్: మండలంలోని మందిపల్లి రైతువేదికలో పోలీసులు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా శనివారం సివిల్ రైటర్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు ప్రజలకు తమ హక్కుల గురించి వివరించారు. సమాజంలో ఎలాంటి మూఢనమ్మకాలు, కుల, మత, వర్గ భేదాలు లేకుండా అందరూ సమానమే అని తెలిపారు. ప్రభుత్వ ఆస్తులు అందరికీ సమానంగా వర్తిస్తాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ కలిసిమెలిసి భినత్వంలో ఏకత్వంగా జీవించాలని సూచించారు. అదే విధంగా రాజ్యాంగం కల్పించిన హక్కులను వివరించారు. గ్రామాల్లో ప్రజల హక్కులకు భంగం కలిగితే ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకురావాలని, వాటిని చట్ట ప్రకారం సాధించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆర్ఐ శ్రీశైలం, ఏఎస్ఐ మన్నన్, సర్పంచ్ అంజమ్మ, ఉపసర్పంచ్ ఖాయ్యుం పాషా తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా: గ్రామాల్లో కుల వివక్ష, అంటరానితం, అసమానతలను తొలగించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆర్ఐ అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కున్సిలో పోలీసులు, రెవెన్యూ శాఖ అధికారులు సంయుక్తంగా నిర్వహించిన పౌర హక్కుల దినోత్సం సందర్భంగా ప్రజలకు పౌరక్కులపై అవగాహన కల్పించారు. ఎస్పీ ఆదేశాల మేరకు ప్రతి నెల చివరి తేదిన గ్రామాల్లో పౌరహక్కులపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ శంక్రమ్మ, అంజనేయులుగౌడ్ పాల్గొన్నారు.

సమస్య పరిష్కారానికి కృషి



హెచ్‌ఎంతో వివరణ తీసుకుంటున్న ఇన్‌చార్జీ ఎంఈఓ వెంకటయ్య

మాగనూర్: మండలంలోని అచ్చంపేట ప్రాథమిక పాఠశాల ఆవరణలో ప్రమాదకరంగా ఉన్న ఇనుప చువ్వల వల్ల విద్యార్థులకు ఏర్పడుతున్న సమస్యను పరిష్కరిస్తామని ఇన్‌చార్జీ ఎంఈఓ వెంకటయ్య అన్నారు. శుక్రవారం ఆయన పాఠశాలను సందర్శించగా పాఠశాల ఎదుట అసంపూర్తిగా ఉన్న అదనపు గది యొక్క పిలర్ల ఇనుప రాడ్ల కారణంగా విద్యార్థులు ఆడుకోవడానికి కూడా అవకాశం లేకుండా ఉందని గుర్తించారు. దీంతో పాటు తరగతి గది నుంచి బయటకు వస్తే ముందుగా వాటిని దాటుకుని వెళ్లాల్సిన పరిస్థితిలో ప్రమాదం సంభవించే అవకాశం ఉందన్నారు. దీనిపై ఆయన పాఠశాల హెచ్‌ఎం యొక్క వివరణ లిఖిత పూర్వకంగా తీసుకున్నారు. అంతకుముందు ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి, సర్పంచ్ రాజు కూడా పాఠశాలను తనిఖీ చేసి ప్రమాదకరంగా ఉన్న ఇనుప రాడ్లను తొలగింపజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం నర్సిములు, పాఠశాల హెచ్‌ఎం శశిరేఖ, ఉపాధ్యాయులు నరేందర్, తిమ్మప్ప, బలరాం, రమేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

మాగనూర్: మండలంలోని బైరంపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సర్పంచ్ మంజుల ఆధ్వర్యంలో పాఠ్య పుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు చదవులో బాగా రాణించేలా కృషి చేయాలన్నారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక విద్యకు పెద్దపీట వేస్తుందని తెలిపారు. చాలా మంది తల్లిదండ్రులు వారి వారి పిల్లలను ప్రైవేట్ బడులకు పంపి రూ.వేలు వృథా చేసుకుంటున్నారని, ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు ఉచితంగా కల్పిస్తూ నాణ్యమైన విద్యను అందిస్తున్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధాపోధ్యాయుడు శ్రీనివాసులు, ఉప సర్పంచ్ నవీన్, గ్రామస్తులు రాఘవేంద్ర, రాఘవేంద్రగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూరు: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఎంఈఓ వెంకటయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని చిన్నపొర్ల ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. 4, 5వ తరగతుల్లో విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానాన్ని రాబట్టారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, ప్రతి నెల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించి విద్యార్థుల ప్రగతిని వారి ముందు ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జగదీష్, ఉపాధ్యాయులు పృథ్వీరాజు, ఆనంద్, గీత, అనురాధ, బాలకుమారి పాల్గొన్నారు.

వైభవంగా ముగిసిన జాతర

నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలోని బహర్‌పేటలో కొలువైన తిరుమల గుట్ట వేంకటేశ్వర స్వామి జాతర, ఏకదాశి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, విశేష పూజలను ఘనంగా నిర్వహించారు. అనంతరం మధ్యాహ్న మహా మంగళ హారతి చేపట్టారు. ఆలయ ప్రాంగణంలో రెట్టపట్ల పోటీలను నిర్వహించి, విజేతలకు బహుతులను ప్రదానం చేశారు. అదే విధంగా జిల్లా కేంద్రంలో సరాఫ్ బజార్ పాండురంగ స్వామి ఆలయంలో స్వామివారికి అర్చకులు అభిషేకం, ప్రత్యేక పూజలను నిర్వహించారు.



వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో రెట్టపట్ల పోటీల్లో తలపడుతున్న యువకులు

కేసీఆర్ అరాచక పాలనకు చరమగీతం



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కోస్గి: కాంగ్రెస్ జాతీయ నేత రాహుల్ గాంధీ చేసిన 'హాత్ సే హాత్ జోడో పాదయాత్ర' స్ఫూర్తితో మున్సిపల్ పరిధిలో ఈ నెల 3 నుంచి చేపట్టే పాదయాత్రకు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం కోస్గిలో ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కొనసాగుతున్న అరాచక పాలనను గడపగడపకు వివరించేందుకు ఇంటింటి ప్రచారంతో పాదయాత్ర నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 3 నుంచి పట్టణంలోని మున్నూర్ వీధిలో ఉన్న తిమ్మనబావి శివాంజనేయ స్వామి ఆలయం నుంచి యాత్రను ప్రారంభిస్తున్నామని పేర్కొన్నారు. కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై పాదయాత్రను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో టీపీసీసీ మెంబర్ వార్ల విజయ్‌కుమార్, మండల అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు బెజ్జు రాములు, పట్టణ అధ్యక్షుడు తుడుం శ్రీనివాస్, కౌన్సిలర్లు గోవర్ధన్‌రెడ్డి, ఇద్రీస్, భానునాయక్ పాల్గొన్నారు.

జాలీఫోనిక్స్‌తో సులభంగా ఇంగ్లిష్



మక్తల్‌లో హెచ్‌ఎంలకు జాలీఫోనిక్స్ మెటీరియల్ అధికారులు

మక్తల్: పట్టణంలోని విద్యార్థులకు పంపిణీ చేసేందుకు అవసరమైన జాలీఫోనిక్స్ మెటీరియల్‌ను పాఠశాలల హెచ్‌ఎంలకు తహసీల్దార్ తిరుపతయ్య, ఎంఈఓ వెంటకయ్య చేతుల మీద స్థానిక ఎమ్మార్సీ భవనం వద్ద శుక్రవారం అందజేశారు. నారాయణపేట కలెక్టర్ కోయ హర్ష ప్రత్యేక చొరవతో విద్యాశాఖ ప్రాథమిక స్థాయి విద్యార్థులకు ఆంగ్లంలో స్పష్టమైన ఉచ్ఛారణలో శిక్షణ పొందుటకు జాలీఫోనిక్స్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం అనిల్‌గౌడ్, హెచ్‌ఎం శ్రీనివాస్‌గౌడ్, సీఆర్పీలు సునీత, పరిమళ, కంప్యూటర్ ఆపరేటర్ శ్రీనివాస్, అల్తాఫ్ పాల్గొన్నారు.

నర్వ: జాలీఫోనిక్స్ ద్వారా చిన్నారులు సులభంగా ఆంగ్లం నేర్చుకోవచ్చని నోడల్ అధికారి రాజేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం నర్వ ఎమ్మార్సీలో జాలీఫోనిక్స్ మెటీరియల్‌ను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల ఉపాధ్యాయులకు రెండు రోజుల పాటు జాలీఫోనిక్స్ ద్వారా ఆంగ్ల బోధనపై శిక్షణ అందించామన్నారు. 1, 2 తరగతుల విద్యార్థులకు సులభంగా ఆంగ్లబోధన చేపట్టేందుకు ఈ మెటీరియల్ ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో సీఆర్పీలు నర్సిములు, రోజా, హెచ్‌ఎంలు సూరం వెంకటేష్, శ్రీనివాస్, బలరాం, ప్రదీప్, ఉపాధ్యాయుడు హరిశంకర్ పాల్గొన్నారు.

భద్రత ప్రమాణాలు పాటించాలి



మద్దూరు: విద్యుత్ ఉద్యోగులు తప్పనిసరిగా భద్రత ప్రమాణాలను పాటించాలని ఏడీఈ సుధారాణి సూచించారు. విద్యుత్ భద్రత వారోత్సవాల్లో భాగంగా మద్దూరు సెక్షన్ కార్యాలయంలో శుక్రవారం మద్దూరు మండల పరిధిలో పనిచేస్తున్న లైన్‌మెన్, జూనియర్ లైన్‌మెన్లకు, సబ్ స్టేషన్ల ఆపరేటర్లకు, బిల్లింగ్ చేసే వారికి భద్రత ప్రమాణాలపై అవగహన కల్పించారు. అనంతరం వారికి సేఫ్టీ మెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఏఈ మహేష్‌గౌడ్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మద్దూరు: తొమ్మిదేళ్ల కాలంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు వివరించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని బీజేపీ మండల అల్పకాలిక విస్తారక్, కర్ణాటక రాష్ట్ర ఉడిపి జిల్లా కార్యదర్శి గురుప్రసాద్‌శెట్టి కార్యకర్తలకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో బీజేపీ కార్యకర్తలతో వారు మాట్లాడారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని ప్రజలు నమ్ముతున్నందున బూత్ స్థాయిలో కష్టపడి పనిచేయాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శంకర్, ప్రధాన కార్యదర్శి సాయిలు, కార్యకర్తలు భరత్, రఘు, శేఖర్, అనిల్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపా' కేసులు ఎత్తివేయాలి



మక్తల్: ప్రజాసంఘాల నాయకులపై అక్రమంగా పెట్టిన ఉపా కేసులను ఎత్తివేయాలని పట్టణంలోని మార్కెట్ యార్డులో వివిధ రాజకీయ పార్టీల నాయకులు శుక్రవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాట్లాడుతూ తాడ్వాయి కేసుల్లో ఆరుగురిపై మాత్రమే కాకుండా మిగతా 146 మందిపై ఉపా కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంఘాల నాయకుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని మండిపడ్డారు. ఉపా కేసులు ఎత్తివేయకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. మక్తల్ మార్కెట్ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మధుసూదన్‌రెడ్డి, చంద్రశేఖర్, రవికుమార్, జీర్గల్ నాగేష్, వెంకటేష్, నారాయణ, భగవంతు, కొండన్న, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ గాయకుడికి తీవ్ర అవమానం

నారాయణపేట టౌన్: ఉద్యమ గాయకుడు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ సాయిచంద్ అంత్యక్రియలు ప్రభుత్వం అవమానకరంగా నిర్వహించిందని వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు కృష్ణ మడివాల్ ప్రకటనలో శుక్రవారం పేర్కొన్నారు. తన పాటలతో ప్రజలు ఉద్యమ స్ఫూర్తి నింపాడని తెలిపారు. సాయిచంద్ అంత్యక్రియలను ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించకుండా అవమానపరిచారని విమర్శించారు.

ఎస్సీ వర్గీకరణ చేసే వరకు పోరాటం

మాగనూర్: మండలంలోని కొల్పూర్‌లో ఎమ్మార్పీస్ నూతన గ్రామ కమిటీని శుక్రవారం నియోజకవర్గ కన్వీనర్ కళ్యాణ్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎనుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా కుక్కలు నర్సిములు, ఉపాధ్యక్షుడు ఎర్ర బాబు, అధికార ప్రతినిధి గిర్ని అంజప్ప, ప్రధానకార్యదర్శి ప్రతాప్, కార్యదర్శిగా రమేష్, కోశాధికారి అంజప్ప, మాలె శ్రీనివాసులు, మారెప్ప, రాము, బాలప్ప, పెద్ద సాయన్న, తిరుమలేష్, శ్రీను తదితరులతో కమిటీని ఎనుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత సాధించుకునేందుకు అందరూ ఏకం కావాలని పిలుపునిచ్చారు. అధికారంలోకి వస్తే 100 రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చిన బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లు అయినా నిర్లక్ష్యం చేస్తుందని అన్నారు. ఇప్పటికైనా బహుజనులంతా ఆలోచించి ఓటు వేయాలని కోరారు.



సభ్యులను అభినందిస్తున్న నాయకులు

ధరల నియంత్రణలో ప్రభుత్వాలు విఫలం



ధర్నా చేస్తున్న మహిళలు

కోస్గి: సామాన్య ప్రజలకు అవసరమయ్యే కూరగాయలు, ఇతర నిత్యావసర సరుకుల ధరలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని, ధరలను నియంత్రించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ప్రసన్నరెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం పార్టీ రాష్ట్ర మహిళా విభాగం ఆదేశాల మేరకు పెరిగిన ధరలను నిరసిస్తూ స్థానిక శివాజీ చౌరస్తాలో మహిళలతో కలిసి ధర్నా, రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా ప్రసన్నరెడ్డి మాట్లాడుతూ కూరగాయల ధరలు గతంలో ఎన్నడూలేని విధంగా పెరిగిపోయాయని, పెరిగిన ధరలతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వమే ధరలను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

దీక్షకు కాంగ్రెస్ మద్దతు

నారాయణపేట రూరల్: కోటకొండ మండల సాధన సమితి ఆధ్వర్యంలో చేపడుతున్న నిరాహార దీక్షలు 52వ రోజుకు చేరుకున్నాయి. శుక్రవారం దీక్షకు కాంగ్రెస్‌పార్టీ మద్దతు ప్రకటించింది. బీఆర్ఎస్ ప్రభుత్వం కోటకొండను నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం

దామరగిద్ద: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమంపై బీజేపీ ఇంటింటి ప్రచారం చేపట్టింది. శుక్రవారం మండల కేంద్రంలోని బూత్ లెవల్ అధ్యక్షుల సమావేశం అనంతరం ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సత్యనారాయణ, శ్రీనివాస్, వెంకటప్ప, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మొక్కలు సంరక్షించాలి

మాగనూర్: హరితహారంలో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల్లో మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించాలని ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం ఆయన మండల కేంద్రంలోని ఎంపీడీఓ సమావేశ మందిరంలో ప్రజాప్రతినిధులు, అధికారులతో అవెన్యూ ప్లాంటేషన్‌పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కల యొక్క సైజ్ 1.5 మీటర్లు ఉండేలా చూసుకోవాలన్నారు. హరితహారంపై ఎవరైన నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ముఖ్యంగా పెట్టిన ప్రతి మొక్క పెరిగే విధంగా చూడాలని, వాటికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్యామలమ్మ, వైస్‌ఎంపీపీ తిప్పయ్య, ఎంపీఓ జైపాల్‌రెడ్డి, ఏపీఓ సత్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూరు: హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ ఎల్కోటి లక్ష్మి కోరారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ భవనంలో హరితహారంపై అధికారులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలో 1.30లక్షల మొక్కలను నాటాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లో ఇప్పటి వరకు తవ్విన గుంతలు, నాటిన మొక్కలు తదితర విషయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అశోక్‌కుమార్, ఎంపీడీఓ కాలప్ప, ఈసీ శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఊట్కూరులో మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మి